# తేనెపట్టు

[కథానిక]

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

నేను ఎప్పుడూ యింతే. ఏదో మహా సరదాపడి చెయ్యడం, చివరకి ఫలితం చిన్నబుచ్చుకోవడంన్నా. ఏనాటి మేనమామగారిల్లు! పదిహేనేళ్ళయినా అయివుంటుంది, వెళ్లి. మళ్ళీ సరదాగా ఆ తోటలూ దొడ్లూ తిరిగి, జామికాయలూ అవీ చెట్లెక్కి కోసుకుని తిని హాయిగా అనుభవిద్దాం అనిపించింది. ఇంకెందులోనూ లేకపోయినా, యీ విషయంలో మాత్రం భార్యామణి కూడా సహకరించింది: 'తొలిపురుడు యీ కొండవూళ్లో పోసుకు జుర్రుకున్నాను, చాల్నా; యీమాటైనా మా యింటికి పంపరుటండీ?' అనేసరికి, వెంటనే బండి యెక్కించేసేను, అందుక నేను! అవునా? అందాకా అన్నీ బాగానే నడిచేయి. అదుగో ఆ బారసాల చేసుకుని రావడంలో వొచ్చింది అల్లరి. అల్లరంటే అల్లరా? తలుచుకుంటే సిగ్గుతో ఒళ్లు చచ్చిపోయి, యిహను యేనాడూ ఏ పల్లెటూరూ మరి వెళ్లకూడ దనిపించేస్తేను!!

## ౨

ఊః ఒకటే నవ్వు, అహ్హాహ్హా అని! మరదలూ, బావలూ అయితే మరీని; విరగబడి, డొక్కలు చేత్తో పట్టుకుని 'అమ్మయ్యా' అని మశ్యమశ్య ఆయాసపడి, మళ్ళీ ఒకరిని చూసి ఒకరు శక్తి తెచ్చుకుని ఒకరి మీద ఒకరు పడి కౌగలించుకుంటూ, చేతులు చాపి నా వంక చూపిస్తూ దొర్లి దొర్లి మరీ నవ్వుతున్నారు. ముక్కు చీదుకున్న వాళ్లూ, కళ్లుతుడుచుకున్న వాళ్లూ వాళ్లూ వీళ్లూ యేమిటి? పల్లెటూరి సంత. పెయ్యని విప్పడానికి వచ్చిన వెంకన్నా, కరణంగారికి గెడ్డాం చెయ్యవచ్చిన మంగలిరావుడూ, చల్లముంత పట్టుకొచ్చిన శిష్టుకరణాల అమ్మాయీ, పెండే నుంచి జీడిపళ్లు పట్టుకొచ్చిన వెట్టిలచ్చన్నా— ఆ వూరి అయిదు వందల గడపా వాళ్ల ముందర వాకిట్లోనే విరుచుకు పడిందంటే నమ్మండి, ఆ వేళ.

అందులో ఆదిలక్ష్మి అయితే బొత్తిగానే బరిదిగి పోయింది. చిన్నపిల్లా చితకపిల్లా? మా మావయ్య యీడు ఉంది. అతనిలాగే నలుగురు పిల్లలూను. అయినా అదేం బుద్ధి తక్కువ మనిషో! అదీ గంగవెర్రు లెత్తిపోయింది. అంతేనా?—

పంతులూ, పంతులూ
పట్టణపు పంతులూ
పల్లెటూళ్ళో ఏఁవిపాట్లు
పడ్డావోయ్ పంతులూ!—

ఆరి దీనింట పటాలం బోనూ, ఆసుకవిత్వం కూడాను. కాపరానికి రాగానే మొగుణ్ణి మొట్టికాయ మొట్టి, ముక్కు నులిపి తాళంచెవి బొడ్డున కట్టుకున్న మనిషి ఆదిలక్ష్మి. దాని పెంకితనానికి ఏవిటిలే అని సమాధానపడదాం అనుకుంటే— వాళ్లున్నారే మా మరదళ్లూ వాళ్లూను! అది ఒకొక్క చరణఁవే కల్పించి, పాడి, తన ప్రజ్ఞకి తానే పరవశం చెందిపోయి పరవళ్లు తొక్కుతూ ఉంటే, కూడా ఎదరతాళం వేసినట్టూ, వీళ్లు లక్క పిడతల్లాగ నోళ్ళు తెరుచుకుని, మల్లిదండల్లాంటి పళ్లు పైకి కనబరుస్తూ, కందగడ్డల్లాగ చెక్కిళ్లు కందచేసుకుని, గుక్కపట్టి విడిచినప్పుడల్లా సముద్ర కెరటాల్లాగ పమిటలు ఎగురుతూ ఉంటే—వెదుళ్లు బద్దలగొట్టినట్టూ—అబ్బ, అది నవ్వు కాదు!

పోనీవయ్యా. ఆడవాళ్లూ, చిన్నవాళ్లూను; ఏవో చిలిపి చేష్టలు చేసేరే అనుకుందాం. ఇతనికేం వొచ్చిందనీ? మా మావయ్యకి? ఆయనా పిల్లలతో

సమం అయిపోయినాడు. గోడకి జేరబడి బల్లమంచం మీద గొబ్బికం వేసుక్కూచుని, హేండిలుబారు మీసాలు సూదిగా మెలిపెడుతూ అన్నాడు—

"ఏవిట్రా చెట్టంత మనిషితో ఆ హాస్యాలూ ?" కంఠంలో గాంభీర్యం, పలకడంలో పటిమా ప్రభ వించేయి. గదమాయింపే, అందుకు సందేహం లేదు. కాని మీసాలు మాత్రం చిగురులంట పరిగెత్తునట్టయి, పెదిమల కొసలు తోణికిసలాడేయి. కళ్లల్లో చిలిపి తనం మెరిసింది. నిమిషం ఊపిరి ఆడిందో లేదో, ముందర వాకిట్లోంచి వెల్లువగా విరుచుకుపడింది అట్టహాసం. ఈ పెద్దవాళ్లకీ అదే బుద్ధి! మహారాజే మాభాగం లేమరి మొర్ర లెవరితో ను ? అసలు కట్టు కున్న కాంతారత్నమే గాజులు గలగల లాడిస్తూ, చెయ్యి నోటికి అడ్డం పెట్టుకుంటూ, రైటుయాం గిల్ గా వొంగి, అంతలో నిటావుగా నుంచుని, నడ్డిని చేతులు ఆనుకుని, మొహం ఆకాశం కేసి పెట్టి-

"అదికాదు నాన్నగారూ ...తహ్ అహ్హాహా... హ్హాహ్హా... తమ్ముడు... ఉహ్హూ...హ్హూహ్హూ... చెబుతూ నే...హ్హెహ్హెహ్హె..."

హమ్మో విరగబాటూ ! తమ్ముడు చేప్పేడు, తను విన్నాది. ఎటొచ్చీ వినక చెడినవాణ్ణి నేనే. ప్రారబ్ధం. అసలు సంగతి ఏవిటని ఒఖ్ఖరూ చూడరు కదా ! ఏందుకు చూస్తారూ ? ఎన్ని తర్క వితర్కాలు చేసుకున్నా నాలో నేనే. పరిస్థితి తరిచి, ఆలోచించుకుని, ఆకళించుకుని, అలిసి పోయి, విసుగొచ్చి ఊరుకోవలిసింది నేనే. ఎవరి క్కావాలి ? ఆడదానికి పుట్టింట పట్టపగ్గా లుంటాయా ? అందులోనూ పల్లెటూరూ, కరణం గారిల్లూను !

మొన్న పొద్దున్నే జెండా యెత్తేస్తాను మొర్రో అంటే పడనివ్వలేదు తను. "తోటలో కాయలు దింపించి యిస్తాను ఉండండి" అని మావయ్య అంటే కాదనీ అనలేకపోయేను, మరి. ఎందుకో ఆ దుర్ధ! చిన్నప్పట్నించీ తింటూనే వున్నాం, యిప్పటికీ యేటేటా కొంటూనే ఉన్నాం; అయినా, యేవిటో, ఏ యేటి కాయేడే ఆ సువర్ణలేఖ లంటే బుర్ర వెర్రి తలకాయ లేసుకు పోతుంది. తొలినాడు షికా రుగా వెళ్ళి చూసికూడ వొచ్చిందేమో, పలకబారిన కాయలు కావు వేసినట్టూ, అప్పుడే ముగ్గిపోయి విందు లారగిస్తూన్నట్టూ కలగన్నాదిట కూడాను మాఅవిడ—

"తెల్లవారగట్టే వొచ్చిన కల, అమ్మా." దాంతో వాళ్లమ్మ ఊః యిదయిపోయి. "మంచిదే తల్లీ. పసుపూ పళ్లూ యివన్నీ లక్ష్మీప్రదం. పండంటి పిల్లలు పుడతారు" అంది.

"ఉన్న యీ సంతానం చాలనట్టు" అన్నాను గ్లాసులో కాఫీ గుక్కెడు మింగి. అంతలో మా చిన్న బావా అందుకున్నాడు, "పండంటి పిల్లలు బావా. ఇప్పుడు ఉన్నవాడు కసురుగాయ మరి. ఎముగ తే పొదుగు తే రాలుగాయ కావచ్చు ననుకో—"

అసలు మా చిన్నబావకంటే గడుగ్గాయ యింకో కడు ఉంటాడంటే నేను నమ్మను.

"మేనమామల పోలిక గాబోలు నోయ్, బావా"

తమ్ముణ్ణి అనేసరికి తనకి పట్టరాని ఉక్రోషం వచ్చింది.

"చాల్లెస్తురూ. చిన్నవాళ్లని చేసి ఆడించ డానికి మీ తరవాతే."

కొలనిలో హంస రెక్క లల్లాడించి నీట సాగి పోయినట్టు, కొత్తచీర కుచ్చెళ్లు రెపరెప లాడించు కుంటూ పెరట్లో నూతిదగ్గరకి నిష్క్రమించిం దామె.

నేనూ లేచి అగ్గిబొద్దు కోసం గోడనున్న అద్దం వెనక తడిమేను. లేదు. వీధి చీడీ మీద, పడమటింటి పెణకనా కూడా వేళ్ళు అల్లల్లాడి మట్టి అయినాయి. ఇంక వెతకవలసిన చోట్లు లేవు. ఉహ్. మామయ్య మొలనే వుండి వుంటుంది. పల్లెటూరివాళ్ళకి యిదో అలవాటు. ప్రతీదీ యిట్టే మొలన దోపేస్తారు. పెరట్లో నీళ్ళపొయ్యిదగ్గిరకి పోయేను, మొదటి రెండు వేళ్ళతోనూ సిగరెట్టు బులబులాగ్గా పట్టుకుని.

తను నీళ్ళు తోడుతోంది. అత్తయ్య బియ్యం కడుగుతున్నది. పైమీది తుండుగుడ్డ పాగా చుట్టుకుని మోకాలిపైకి పంచె ఎగగట్టి, మునిపళ్ళతో చుట్ట నొక్కి పట్టుకుని, నూతికి పల్లంగా ఆ నీటి చాలమ్మటే ఒక్కొక్క నిమ్మ మొక్కకీ కాలువ చేస్తున్నాడు, మామయ్య. పడమటింటి పంచలో దండీలు తీస్తు న్నాడు చిన్నబావ. ఎదరగా పాతిక గజాలలో

బుల్లావు నుంచుంది, ఆప్యాయంగా పెయ్య ముట్టె నాకుతూను. దాని పక్కగా మునివేళ్ళమీద కూచుని పాలు పితుకుతున్నాడు వాళ్ళ అన్న. అంతలోకే—

"ఒరేయ్, పెద్ద బాబూ, పాలు తియ్యడం అయితే ఆ నాలుకాయలూ దింపించుకురండ్రా, తీరిపోతుంది. మళ్ళీ నోట్లో మెతుకులు గొంతుక దిగకుండానే ప్రయాణం అంటాడు వాడు. కాఫీ పుచ్చుకున్నాడులా వుంది. వాణ్ణి కూడా తీసుకెళ్ళు. గెడ్డమ్మటే వెళితే సరి, ఆచ్ఛేదనలూ తీర్చుకోవచ్చును."

మామయ్య మాటలు చెవిని పడడంతోనే గభుక్కున సిగరెట్టు విసిరేసేను. గడ్డిమేటిమీద పడింది గాబోలు, నిముషంలో మూల నుంచి పొగ జిమ్మింది. ఒక్క గెంతులో పెద్దబాబు నవ్వుకుంటూ వచ్చి బాల్చీడు నీళ్ళు దిమ్మరించేడు.

"వందేమాతరంలో అల్లుడు!"—సన్నంగా స్పష్టంగా వినిపించేయి మాటలు. వెనకనే నుంచుని మరదలు నవ్వలేక ఉక్కిరి బిక్కిరి అవుతోంది.

"ఇదుగో, పార్వతీ, యిలాగ అల్లరి చేసేమాటుంటే నాతో తోటకి రావద్దు."

"లేదు, బావా," అంటూనే ఉపద్రంగా పొరమారింది.

"అదుగో, లేదంటూనే ఏవిటా విరగబాటు!"

ఎన్నిఅన్నా, పోటుగా ఉన్న సముద్రపు కెరటాల్లాగ పార్వతి అదే నవ్వు!

## 3

"బాబ్బాబు, దణ్ణం ఎడతాను."

"ఏవిరా, కాయలు ఏమయినా ఉన్నాయా, ఉడతలూ ఋషిపక్షులూ కొట్టేసేయా?"

ధ్వని స్ఫుటంగా గోచరించేటట్టు తోటకాపులతో మాట్లాడుతూ, అక్కడక్కడ పడివున్న ముళ్లకంపలు చేపాటికర్రతో దూరంగా విసిరేస్తూ, కాలిబాటమ్మటే బాటాచెప్పులకన్నా తేలికగా గోడుగుపావుకోళ్ళతో సాగిపోతున్నాడు బావ. పలకబారిన మామిడికాయ ఒకటి ఉడతలాగ మునిపళ్ళతో కొరుకుతూ, మిట్ట పల్లాలు లెఖ్ఖ లేకుండా, గాలిలో తేలుతూ నడుస్తోంది పార్వతి. వాళ్ళ అడుగుల్లోనే అడుగులు వేసుకుంటూ, నాటుదారిని నడవలేక గిడగిడలాడుతున్నాను నేను. తోట చేరుకునేసరికి అప్పుడే సగం చెట్లకాయలు దింపేసేరు. అంతలో—

"బాబుగోరు, అన్నట్టు సెప్పడం మరిచి పోయాను. ఆడ మా సిక్కని తేనెపట్టుంది బాబూ."

"ఎక్కడరా, చెప్పవేం? అక్కయ్య అన్నది కూడాను, పిల్లడికోసం ఓ చుక్క జాగర్త పెట్టమనీ."

"ఇప్పుడేటి పోయిందినే, బాబూ. గంజేలకి కొండదొర్లు రానేవత్తారు. ఆల్లసేత పంపిత్తాన్నే బాబూ."

"అయ్య వొచ్చేదాకా ఆవాస ఆగుతుంద్రా, మరీ?"

"సిటంలో రార్ట, బాబూ, దొర్లూ. ఎంతసేపేటి పట్టియ్యడం?"

సరే నన్నట్టు తల పంకించేడు బావ. నాకు గుండెల్లో రాయి పడిపోయింది. సిటంలో వొత్తానంటే శతాబ్దానికి కంటపడతా నని తాత్పర్యం, పల్లెటూరి కాలమాన ప్రకారంన్నా. ఇంక ఆ పూటా ప్రయాణం జరగదు కాబోలు. నాటికి రెండు రోజులయి, ఏరోజు కారోజే ప్రయాణాలు అబద్ధం ప్రసాదాలు నిబద్ధీ అయి ఊరుకుంటున్నాది.

"వాళ్ళే వొస్తారో, మరి యెవరిచేత నయినా పంపుతావో, పెందరాళే తెవుల్చు. చూశావా మా బావ అప్పుడే ఎలాగ బిక్కమొహం పెట్టేసేడోనూ." అన్నాడు బావ.

అమ్మయ్య! కొంత గుండెదడ తగ్గింది. మరి కాస్సేపటికి కాయలు గంపల్లోకి యెత్తింపించి పార్వతి యింటికి వెళ్ళింది. మేం నాలుగడుగులు అలా గెడ్డమ్మట వెళ్ళేసరికి, ఆ పక్కడొంకల్లోంచి దిగబడ్డారు—చేతుల్లో నెమలి వెంద్రుకలూ, మెళ్లో గవ్వల పేర్లూ, నుదుటని యెర్రగా కాళీ నాలికల్లాగ కుంకం బొట్లూ వీళ్లాను!—కొండదొరలు. పదిమందిమీ కలిసి వెళ్ళేం. పనస చెట్టున పట్టింది చేటంత పట్టు. కిందుగానే ఉంది కూడాను.

అంతకు ముందు ఎప్పుడూ పట్టు తియ్యగా చూళ్ళేదు, నేను. వెట్టి లచ్చన్నా, మంగలి రావుడూ,

నాయుడు కురవన్నా అంతమందీ ప్రక్రియ చెప్పే వాళ్ళే, తేనెపట్టు కొట్టడానికి! ఒ గొల్ల గుంటడు పుట్టగోచీలోంచి అగ్గిబొద్దు తీసి కొబ్బరి పీచున నిప్పు రాజేస్తున్నాడు. అంతకన్నా మరి సమయం దొరక దనుకున్నాడు గాబోలు యింకో పశువుల గుంటడు—తలని చుట్టుకున్న గుడ్డలోంచి చుట్టపీక ఒకటి తీసి నవుల్తూ, "కాసింత అగ్గెట్టరయ్యా" అన్నాడు.

"ఉండోస్సి! పట్టుకి ముందు పొగెట్టాల. ఈకాడికే పంతులు ఊ కూకలేస్తున్న, సూసినావా?" మొదటి వెధవ విసుక్కున్నాడు. పట్టుకి పొగ యెందుకు పెట్టాలో ఎంత ఆలోచించినా తెలిసింది కాదు నాకు. అంతలోకే "యిదండి, నూన" అన్నాడు ఓ నాయుడు, కొబ్బరి బురికెతో నూనె కొండవాళ్ళకి అందిస్తూను. సరే, ఇహ తెలిసి పోయింది. ఆ దొరలు నూనెతో దీపం పెట్టి, పొగ ధూపం వేసి పూజలూ పునస్కారాలూ చేస్తారు. కొండవాళ్ళ ఆచారాలు మా తమాషాగా ఉంటాయి. అన్నారు గారూ, కొండజాతిఉపన్యాసకులు, ఓసారి ఉపన్యాసంలోనూ! అందుకు సందేహవా? అడుగో ఆ కొండవాడు కాశికోక ఎగగట్టి, మోచేతులకి పైగా చిక్కగా నూనె పట్టించుకుంటున్నాడు. ఏదో వుంది తంతు. పూజలూ, నైవేద్యాలూ, ఆ తరవాత కోదు నాట్యాలూ కాబోలు. సినీమాల్లో చూడ్డానికీ, ఉపన్యాసంగా వినడానికీ అయితే యీ తతంగం బాగానే వుంటుంది. కాని, పని ఆరు మూడు అయిపోతూ ఉంటే యెలాగా? రిస్టువాచీ చూసేను. ఎనిమిదిన్నర!

"ఓయ్ బావా, టయిము వేష్టయి పోతోందోయ్" అన్నాను.

"అన్నా, గట్టి తంటా వచ్చిందయ్యా నీతోనూ! నీ పనే చేస్తున్నారా, మరేం ఆడుకుంటున్నారా?"

"తేనెపట్టు తియ్యడానికి యింత బ్రహ్మాండం ఏవిటోయ్"

"ఏదీ నువ్వు తియ్యి, చూద్దాం."

"అహ్. పులి సీవలకి జడిసి రెండు బొదవాకులు కొయ్య నేక పోనాడు గానీ, యిత్తరంటలకి గావాలం లేను!" కూర్మినాయుడు యీసడించేడు, నా చిన్నతనం పురస్కరించుకుని.

"నువ్వు తీసేవు లేరా, కురవన్నా" ఎగతాళిగానే అన్నాను వాడికేసి తిరిగి.

"పల్లకోవయ్యా. బండెక్కడానికి "టూలు బల్ల" కావాలి కాని, సైటెక్కి పట్టు గోసినావ్! సాల్లే."

కొండవాళ్ళు కళ్ళు మెరిపించి, పళ్ళు యిగిలించేరు. చుట్టూ మూగిన కాపనూక గొల్లు మంది ఒక్కసారి. నాకు పౌరుషం వచ్చింది. ఎదరనున్న గుంటడిదగ్గిర కొడవలి పుచ్చుకుని, దోనెక్రకి కట్టేను.

"ఏటి సేత్తా వే టయ్యోయ్" కూర్మి నాయుడే ఆ ప్రశ్న.

"నెమ్మదిగా ఊరు చేరుకోవాలని లేదా యేవిటి బావా?"

"చూస్తూ ఉండండ్రా, అయిదు నిమషాలు. చేత్తో తీసినట్టు పట్టుకి పట్టూ, చిక్కంలో పడిపోవలసిందే" అంటూ దోనెక్రర ఎత్తేను.

"ఓలమ్మ, ఓలమ్మ" అంటూ మూగిన వాళ్లంతా చెల్లా చెదరయిపోయేరు. "బాబ్బాబు" అంటూ కొండవాళ్లు నా రెండు బుజాలూ పట్టుకున్నారు. అంతటితో నా పని విరమించుకుని, పాతిక గజాలు దూరంగా పోయి నిలుచున్నాను. మరో పది నిమషాలకి గాఢంగా పొగజిమ్ముకుంది చెట్టుక్రింద. జుమ్మ్మంటూ యీగలు యెగిరి నాలుగు దిక్కులా పారిపోతున్నాయి.

"ఆ తువ్వాలు విప్పి కప్పు కోవోయ్ బావా" అన్నాడు బావ, బుజం మీది నాగుల గావంచా తను మొహం మీదినుంచీ కప్పేసు కుంటూను.

"ఇంత దూరం రావులే వోయ్; వొచ్చినా పైపైనే ఎగిరి పోతాయ్!"

"నిన్ను సూసి బెదిరి పోతాయ్ నే, పంతులూ, పల్లిటిగోడ్లు!" కురవన్నరొయ్యి విదిల్చి చుట్ట అడ్డ పొగ పెట్టేడు.

"లేదురా, నిన్ను చూసి ముద్దెట్టుకుంటాయి" అని వాడితో పరాచకం ఆడుతూనే వున్నాను.

అంతలో అప్రయత్నంగా నాకుడిచెయ్యి నుదుటని "ఠఫీ" మని కొట్టుకుంది.

"అయిందేటి పెళ్లి, పంతులూ ?" చప్పుడికి ఉలిక్కిపడి అడిగిన కురివి నాయుడి కింకా జవాబు చెప్పనే లేదు. నా యెడం చెయ్యి వెలిదిరిగి వీపు నిమిరింది.

"నా మాట విని, యిప్పుడైనా కప్పుకో బావా", బురఖా బీబీ లాగ నాగుల గావంచా ముసుగు లోంచే అన్నాడతను. అబ్బే. ఎన్ని చెప్పినా నేను ససేమిరా. మొండికెత్తి నిలుచున్నానే గాని, చూస్తూండగానే ఎడమకాలు చెప్పులోంచి పైకి లేచి కుడి పిక్కని పక్కమ్మటే రాసింది. ఇంకో రెండు నిమషాలకి అయిందంటే అయిందన్నారు. తాటాకులు దొప్పగా కట్టి, పట్టు అందులో పెడుతూ ఉంటే విస విస వచ్చేసేను.

"నుదుట నా దద్దుర్లేవిట్రా, యిలా రా"

"అబ్బే, యేవీ లేదు, మావయ్యా"

అప్పటి కింకా నాలుగు గజాల్లో వున్నారు, బావా వాళ్లూను.

"ఏవీ లేదంటూనే వీపు అలా బక్కురుకుంటా వేవిటి ? మోచేతులు కూడా కంది నట్టున్నాయి, ఏదీ, యిలా చూడనీ ?"

"అబ్బే, ఏదీ లేదంటూంటేనే." ఎంత ప్రయత్నించి నవ్వుతూ మాట్లాడినా, చిటపట లాడుతూన్న వీపు గోకుకో లేకుండా ఉండలేకపోయేను.

"ఏవీ లేదు, ఏవీ లేదంటూనే అలా దూర దూరంగా పోతా వేవిరా ? తేనెటీగలు గానీ కుట్ట లేదు గద!"

ఆదుర్దాలో గట్టిగా అరిచేడు మామయ్య. అది కాస్తా కురవన్న చెవిని పడింది. ఇహ నేవుందీ ? విప్పేడు భారతం. ఉన్న అభాగ్యులంతా తలో మాటా అన్నారు. పల్లెటూరివాళ్లకి కర్ణపిశాచి కాబోలు. నిమషంలో బెల్లంముక్కకి చీమలు పట్టి నట్టు మూగేసేరు జనం. పకపకలూ, వికవికలూను.

"ఇంత నూనయినా రాయండ్రా, పాపం" అంటూ అత్తయ్య వచ్చింది.

"ఆముదం యిడండమ్మా, రాత్తాను" మంగలి రావుడూ వైద్యుడే వెధవ వూళ్లోను!

"యింత చింతపండుమగ్గరాసి నలిచెయ్యండ్రా, చత్తెం కాబోలు. అంత మకీ బ్రహ్మాండం చేస్తా రేవిటే" అంటూ అమ్మమ్మ దిగబడింది ముందర వాకిట్లోకి. దాంతో నవ్వులకి పడ్డారు నలుగురూను. కూరమ్మన్న అయితే మరీను. "గోశెట్టు పంతులూ, మగ్గు రాయాల. రాగి ముంతోట్టుకు రావమ్మ నువ్వూ, యీాడ నిలుసుండి పోతావేటి బెకబెక లాడుకుంటూను" అన్నాడు, పార్వతిని రెచ్చగొడుతూను. ఎవరి నైనా కాల్చుకుతినడం అంటే మహా సరదా కురివిగాడికి. అక్కణ్ణుంచీ "గోచీ" అంటే "గోచీ" అని మహాధ్వానాలు మిన్నుముట్టి పోయినాయి.

"పోనీ, నా నారలాగు యిస్తాను కట్టుకో బావా." నలుసంత లేడు చిట్టి బావకీ అదేమాట. పది మందీ ఒకటే నవ్వు! శివాట్టహాసలే అయిపోయింది.

రెండు ఝాముల పొద్దు. గొంతుక పొడి ఆర్చుకుపోయింది. పొద్దుటి కాఫీనీళ్లు యిగిరి పోయి కడుపులో కార్చిర్చు, అన్నింటినీ మించిన ఉడుకుబోతుతనమూ, ఉదాసీనమున్నూ. ఇంక అక్కడ నిలబడ్డానికి మొహం చెల్లింది కాదు. గిరుక్కున తిరిగి పడమటింటిలోకి పోయేను. తాతయ్య మంచం పక్కనే పేర్చి వున్నాయి ధాన్యపు బస్తాలు ; గిరవాటేసిన గంపాను. దండెంమీద నుంచి పచ్చడం పలకరించింది, అంతలోకే. అక్కడ యిరుక్కుపోయేను. ఆ మూల జొచ్చి పోయినా, సముద్రపు హోరులాగ వీళ్ల నవ్వు వినపిస్తూనే ఉంది. నవ్వనీ, నవ్విన నాపచేనే పండుతుంది. తిళ్ల వేళ. వెతుక్కుని చావరూ ? గది తలుపు చప్పుడయింది. గభుక్కున గంపలో దూరి పచ్చడం పైన పడేసుకున్నాను.